# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల /నారాయణపేట


## మల్లికార్జున స్వామి ఆలయాలన్ని శుభ్రపరిచిన బిజెపి నాయకులు..

### పాల్గొన్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ



మీడియాతో మాట్లాడుతున్న డికె అరుణ

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 18 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలోని అతి పురాతనమైన మల్లికార్జునస్వామి దేవాలయాన్ని గురువారం ఉదయం బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు అరుణ, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మున్సిపల్ ఛైర్మన్ పావని, వైస్ ఛైర్మన్ అచల, ఎంపిటిసి బలరాంరెడ్డి, కౌన్సిలర్ ప్రసన్నతో కలిసి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో రామ మందిరంలో రాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఆ సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆలయాలను శుద్ధి చేయాలని విగ్రహ ప్రతిష్టాపన జరిగే వరకు నిత్య నైవేద్యాలు, పూజలు, భజనలు జరగాలని ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన పిలుపు మేరకు మక్తల్ మండల కేంద్రంలో ఉన్న మల్లికార్జున దేవాలయంలో శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, అయోధ్యలో కూల్చివేసిన స్థలంపై కోర్టు తీర్పుల మేరకు శ్రీరాముల వారి మందిరం నిర్మాణం జరిపి విగ్రహ ప్రతిష్టాపనను జరిపేందుకు నిర్ణయించారని అందులో భాగంగానే దేశంలో ఉన్న ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి రాముని అక్షింతలు చేరవేయడం జరిగిందని, 22వ తేదీ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు ఐదు దీపాలను వెలిగించి తమ రామభక్తిని చాటుకొని కార్యక్రమం విజయవంతం చేయాలని వారన్నారు.



ఆలయశుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న డికె అరుణ

## ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలి..

### నారాయణపేటజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,జనవరి18 ప్రభాతవార్త:** గురువారం జిల్లా కలెక్టర్ విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎస్ఎస్ఆర్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20,21 తేదీలలో ఓటరు జాబితాపై స్పెషల్ కంపైన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిఎల్‌ఓలు అన్ని డిటైయిల్స్ ఇస్తారని తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు బూత్ లెవల్ ఏజెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ పార్టీ వాళ్లకు పోలింగ్ స్టేషన్లో వారిగా ఓటర్ల జాబితా, బిఎల్ఓ డీటెయిల్స్, డ్రాఫ్ట్‌రోల్, టోటల్ పిఎస్ఈడిఎస్ఈ అందజేశారు. ఫారం 9,10, డిలేషన్స్ లిస్ట్ చనిపోయిన వారి జాబితా అందజేశారు. ఫిబ్రవరి 8న తుది ఓటర్ల జాబితా వెలువడుతుందని తెలిపారు. ప్రతి బుధవారం పొలిటికల్ పార్టీలతో సమావేశం ఉంటుందన్నారు. ఓటరు జాబితాలో పేరు ఫొటో డబుల్ ఎంట్రీ ఉంటే తొలగిస్తామని తెలిపారు. నారాయణపేటలో 200, మక్తల్‌లో 400 తొల గింపుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. నారాయణపేటలో 1268 మక్తల్‌లో 1482 ఓట్లను నోటీసులు ఇచ్చి డిలీట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో అదన పు కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఆరిడిఓ రామచందర్, టిడిపి, బిజెపి, బిఆర్ఎస్,ఐఎన్‌సి, ఎంఐఎం, సిపిఎం ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

## పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తాము..

### టికెట్ ఎవరికి ఇచ్చినా అధిష్టాన నిర్ణయం గౌరవిస్తాం

### సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 18 ప్రభాతవార్త :** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఎవరికి వచ్చిన అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిస్తూ కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని సిడబ్ల్యుసి మెంబర్ చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గం స్థాయి ప్రతినిధుల సమీక్షా సమావేశం మహబూబ్‌నగర్‌లో నిర్వహించారు. ఈసమావేశంలో వంశీచంద్‌రెడ్డితో పాటు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజవర్గాలకు సంబంధించిన భవిష్యత్తు కార్యక్రమం గురించి చర్చించామని తెలిపారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీలను బలోపేతం చేయడానికి తీసుకోవలసిన నిర్ణయాలను చర్చించామని తెలిపారు. ఇప్పటివరకు ప్రతి కాంగ్రెస్ సైనికుడు గత ప్రభుత్వ అవినీతి పాలనకు వ్యతిరేకంగా పనిచేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు ప్రజలకు అందేలా చేయడం కాంగ్రెస్ సైనికుల తక్షణ విధి అన్నారు. రాష్ట్రంలోని ప్రతిజిల్లా, ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి గడపకు కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందేలా యువజన కాంగ్రెస్ ప్రతినిధులు కృషి చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ భావజాలం నంనరాన నింపుకున్న కాంగ్రెస్ నాయకులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నిరంతరం కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.రాహుల్ గాంధి చేపట్టిన జోడో న్యాయ్ యాత్ర సిద్ధాంతాలు, ఉద్దేశ్యాలు ప్రజలకు వివరించాలని ప్రతినిధులకు సూచించారు. రానున్న పది పదిహేను రోజుల్లో మళ్లీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలు అత్యధిక మెజార్టీతో కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి

## అంగన్‌వాడి కేంద్రాలలో మెరుగైన విద్యనందించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 18 ప్రభాతవార్త :** పట్టణంలో వినూత్నంగా ఏర్పాటు చేసిన మోడల్ అంగన్‌వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ కార్యక్రమం ప్రభుత్వం నిర్ణయించి సిలబస్ మేరకు ఖచ్చితంగా అమలు చేస్తున్న అంగన్‌వాడి టీచర్లను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఎల్‌కెజి,యుకెజి పిల్లలతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ వారితో అక్షరమాల, నంబర్లను చెప్పించారు. పిల్లలు తాము నేర్చుకున్న కథలను కలెక్టర్‌కు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల భోజన సమయానికి అంగన్‌వాడికి వచ్చిన తల్లిదండ్రులు కలెక్టర్‌తో మాట్లాడారు. ఈ అంగన్‌వాడ పిల్లల్ని చేర్పించటానికి వేరే గ్రామం నుండి నారాయణపేట వచ్చి అంగన్‌వాడికి దగ్గరలో రూం తీసుకుని ఉంటున్నట్లు ఒక తల్లి చెప్పడంతో కలెక్టర్ సంతోషపడ్డారు. మా పిల్లలు ప్రైవేట్ స్కూల్స్‌లో చదివే పిల్లల కంటే మంచిగా రైమ్స్ చెబుతున్నారని, ఇలాంటి అంగన్‌వాడిని ఏర్పాటు చేసినందుకు తల్లి దండ్రులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అంగన్‌వాడిలు ఇంకా కొన్ని ఏర్పాటు చేస్తే పేద వారికి ఉపయోగం అని తల్లి దండ్రులు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

## ప్రతి పంచాయతీలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులే..

### బిజెపి ప్రభుత్వంలోని గ్రామాలు మరింత అభివృద్ధి

### జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి

**ఇటిక్యాల,జనవరి 18 ప్రభాతవార్త :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నరెంద్ర మోడీ పాలనలోనే గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని ప్రతి పనిలో 90శాతం నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వేముల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి న ఎల్ఈడి, టివి లైవ్‌లో ప్రధానమంత్రి నరెంద్రమోడీ లైవ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయగా లైవ్ ప్రోగ్రామ్‌లో ప్రధాని – మిగతా4లో..



వికసిత్ భారత్ సంకల్పయాత్ర సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి

## పార్లమెంటు ఎన్నికలపై




- అందరి దృష్టి అభ్యర్థుల పైనే..
- ఖరారు కానీ జాబితా..
- సిట్టింగులకు సీట్లు అనుమానమే..
- ప్రధాన పార్టీల్లో ముగ్గురికి మించి ఆశావహులు
- ఇప్పటికే సన్నాహక సమావేశాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి18,ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలకు అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఆశావహులు ఎక్కువమంది ఉన్నారు.2019 ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరుగగా,రానున్న రెండునెలల్లో వారి పదవీకాలం ముగియనున్నది.ఈక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం బీఆర్‌ఎస్‌పార్టీ నుంచి ఎంపీలుగా కొనసాగుతున్న సిట్టింగులకు మళ్లీ టికెట్ ఇచ్చే అవకాశం దాదాపు లేనట్లు తెలుస్తున్నది. దీంతో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తున్నది.

**కాంగ్రెస్ పార్టీ దూకుడు..** పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలు ఎలా గెలుపొందాలనే అంశంపై ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు ఎనుమల రేవంత్‌రెడ్డి ఇప్పటికే సమావేశం నిర్వహించారు.రెండుపార్లమెంట్ సెగ్మెంట్లకు సంబంధించి ముఖ్య నేతలు,ఎమ్మెల్యేలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.గురువారం మహబూబ్‌నగర్‌లో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు,మాజీఎమ్మెల్యే చల్లా వంశీచందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి సమావేశమయ్యారు. పార్టీ టికెట్ కేటాయింపు,రెండుస్థానాల్లో ఎక్కడ పార్టీ బలంగా ఉంది,ఎక్కడ ప్రత్యేకంగా ఫోకస్‌చేయాల్సి ఉందనే అంశాలపై చర్చించారు. అయితే ఎవరికి టికెట్ కేటాయించాలనే అంశాలపై కూడా చర్చ కొనసాగినట్లు సమాచారం. అయితే కాంగ్రెస్‌లో ప్రధానంగా చల్లావంశీచంద్‌రెడ్డి పోటీలో ఉన్నట్లు సమాచారం.2014లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం 2019లో మహబూబ్‌నగర్‌లో ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచి బీఆర్‌ఎస్‌అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిపై ఓడిపోయారు.

**తెరపైకి జీవన్‌రెడ్డి..**బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు మన్నె వెంకట్రామ్‌రెడ్డి కుమారుడు టీటీడీ బోర్డు మాజీసభ్యులు మన్నెజీవన్‌రెడ్డి అనూహ్యంగా తెరపైకి వచ్చా రు.ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలస్తారంటూ వార్తలు వినిపించాయి. ఇటీవల కాం గ్రెస్‌పార్టీలో చేరేందుకు గ్రీన్‌సిగ్నల్ రావడంతో కాంగ్రెస్ ఎంపీఅభ్యర్థిగా బరిలో ఉంటారని సమాచారం. అయితే తాజా పరిణమాల ప్రకారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డికి అవకాశం ఇవ్వనున్నట్లు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది.

**బీజేపీలో బీసీ నినాదం..** బీజేపీలో గత కొంతకాలంగా అగ్రవర్గాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఈసారి టికెట్ బీసీ అయిన బండారి శాంతికుమార్‌కే కేటాయించాలంటూ బీసీ వర్గాలు పట్టుబట్టాయి. అయితే పాలమూరు ఎంపీ టికెట్ తనకే వస్తుందంటూ మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధీమాగా ఉన్నట్లు తెలుస్తున్నది. మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి ముందు టికెట్ ఆశించినప్పటికీ ప్రస్తుతం ఎవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదంటూ చెప్పినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ఇద్దరు మినహా మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ పార్టీలో పెద్దగా పోటీలో నిలిచేవారు లేనట్లు సమాచారం. అయితే టికెట్ ఎవరికి ఇచ్చినా గెలిచేది మాత్రం బీజేపీ పార్టీ అభ్యర్థులనే ధీమాలో పార్టీ శ్రేణులు ఉన్నాయి.

**బీఆర్‌ఎస్‌లో ఆశావహులు..**

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలకు గతంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పోతుగంటి రాములు గెలుపొందారు. అయితే ప్రస్తుతం వారికి మళ్లీ టికెట్ కేటాయించే ఆలోచనలో పార్టీ అధిష్టానం లేదని తెలుస్తున్నది. ఈక్రమంలో ఎంపీ అభ్యర్థిగా పోటీలో నిలిచేందుకు ఆశావహులు పెరిగిపోయారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ సహా, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో టికెట్ ఆశిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా తాజా తెరపైకి మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి , ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు జేపీఎన్‌సీఈ కళాశాలల చైర్మన్ కేఎస్ రవికుమార్ కూడా పోటీలో నిలిచేందుకు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే అధిష్టానం మాత్రం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో వేచి చూడాల్సిందే.

**గిరిజన బిడ్డగా బరిలో ఉంటా..**

గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్ సైతం మహబూబ్‌నగర్ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. పార్టీ అధినేతను కలిసి ఈ విషయంపై చర్చించి నిర్ణయం తీసుకోన్నుట్లు చెప్పారు. దక్షిణ తెలంగాణలో గిరిజన బిడ్డకు ఎమ్మెల్యేగా కాని, ఎమ్మెల్సీగా కాని అవకాశం రాలేదని, ఎస్టీలకు సైతం అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరనున్నట్లు వాల్యానాయక్ తెలిపారు. పార్టీ పురుడుపోసుకున్నప్పటి నుంచి ఇప్పటిదాకా 24ఏండ్లు పార్టీ అభ్యున్నతికి కష్టపడ్డానని, తనకు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చినట్లు చెప్పారు. గిరిజనుల పక్షాన అన్ని కులాల వారికి మతాలకు సముచిత స్థానం అందించాలని కేసీఆర్‌ను కోరనున్నట్లు చెప్పారు. తనకు అవకాశం ఇస్తే తప్పక గెలిచి చూపిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## దేశమంతా జై శ్రీరామ్ నామస్మరణ..

### ఈ నెల 22న ప్రతి ఇల్లు శుద్ధి చేసుకుని ఇంట్లో 5 రామజ్యోతులు వెలిగించాలి

### మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ వద్ద అయోధ్య నుంచి లైవ్

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జితెందర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 18 ప్రభాతవార్త :** భారతదేశంలో ఎక్కడ చూసినా జై శ్రీరామ్ తప్ప వేరే ఆలోచన లేదని ఈనెల 22న అయోధ్యలో బాలరాముని ప్రతిష్టాపన సందర్భంగా ప్రతి ఒక్కరు ఇంట్లో 5 రామజ్యోతులు వెలిగించాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపి జితెందర్‌రెడ్డి కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ ఆలయంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయశుద్ధి కార్యక్రమంలో భాగంగా ఆలయం మొత్తాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 సంవత్సరాల పోరాటం తరువాత అయోధ్య నగరాన్ని పరిపాలించిన రాముడు సీత, లక్ష్మణ్, ఆంజనేయ సమేతంగా ఈనెల 22న అవిబిజిత్ లగ్నంలో అయోధ్య నగరంలో ప్రవేశిస్తున్నారని, ఆ రోజున ప్రజలందరూ ఇల్లు శుభ్రం చేసుకుని ఇంటి ముందు ముగ్గులు వేసి ఐదు దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకోవాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. పాలమూరు ప్రజల ఆశీర్వాదంతో రామున్ని దగ్గరుండి చూసే అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. తన ప్రాంతం ప్రజలు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాని భగవంతుని కోరుతున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో వ్యాపార సంస్థలన్ని స్వచ్ఛందంగా బంద్‌చేసి అందరం అయోధ్యలోనే ఉన్నామని ఆలోచతో గడియారం వద్ద లైవ్ కార్యక్రమాన్ని చూడాలన్నారు. ప్రతి ఇంటిలో ఐదు జ్యోతులు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాముడి ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ప్రధాని నరెంద్రమోడీ 11 రోజులు ఉపవాస దీక్ష తీసుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడి 45 రోజులు అవుతుందని ఎన్నికలవేళ ఎన్నెన్నో హామీలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. వంద రోజులలో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు కదా వంద రోజులు ఎదురుచూద్దాం అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ప్రధాని మోడీకి భారతదేశ ప్రజలు అండగా ఉండి మరోసారి అధికారాన్ని ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాకుల బాలరాజు, ఎపి మిథున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సురెందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, శ్రీరాములు, రమేష్, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జితెందర్‌రెడ్డి



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న జితెందర్‌రెడ్డి, బిజెపి నేతలు

## పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

### సంత బజార్,30 పడకల హాస్పిటల్ పై వివరాలు ఇవ్వండి

### ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి

### కొత్తకోటలో మౌలిక వసతులపై అరా

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

**కొత్తకోట,జనవరి 18,ప్రభాతవార్త :** కొత్తకోటలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు కేటాయించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధికారులను కాంట్రాక్టర్లను ఆదేశించారు.గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.మున్సిపల్ కమిషనర్,విద్యాశాఖ అధికారులు,ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి నిర్మాణంలో ఉన్న బాయ్స్ పాఠశాలను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్ తో మాట్లాడారు..పాఠశాల భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించి,పాఠశాలకు అనుకుని ప్రమాదకరంగా ఉన్న 11 కె.వి విద్యుత్ లైన్,ట్రాన్స్ఫార్మర్ వద్ద భద్రత చర్యలు చేపట్టాలని ఎఈ ని ఆదేశించారు. తదనంతరం గర్ల్స్ హైస్కూల్ వద్ద పెండింగ్ లో ఉన్న బాత్రూం పనులను వెనువెంటనే పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించి,పాఠశాల భవనానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.నూతన ప్రతిపాదనలు అందిన వెంటేనే ముఖ్యమంత్రి తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.అదేవిధంగా మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వాధికారులతో కలిసి ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని పరిశీలించారు.పనులు వేగవంతంగా పూర్తి చేసి,ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.అనంతరం సంత బజార్ స్థలం, 30 పడకల ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యే వివరాలు తెలుపుతూ... గత ప్రభుత్వం ఆసుపత్రికి కేటాయించిన బడ్జెట్ సరిపోక కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రావడం లేదని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్పిటల్ కి సంబంధించి నూతన ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి త్వరలోనే ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్ణాకర్ రెడ్డి,వేముల శ్రీనివాస్ రెడ్డి,బాబు బోయజ్,ప్రశాంత్, కృష్ణారెడ్డి, బిచుపల్లి, మిషేక్, నరేందర్ రెడ్డి,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

### ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని ఆసుపత్రులలో

## ఆరోగ్యశ్రీ సేవలు కల్పించాలి

### 300ల పడకల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ 500ల పడకల ఆసుపత్రి స్థాయిని పెంచాలి

### జిల్లా ఇంఛార్జి వైద్యఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన జడ్పీ ఛైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే

**గద్వాల ప్రతినిధి,జనవరి 18 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా నడిగడ్డ ప్రజలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రా లలోని ఆసుపత్రులలో కూడా రోగులకు ఉచిత ఆరోగ్య శ్రీని కల్పించి వైద్య సేవలు అందించాలని అలాగే గద్వాల జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న 300ల పడకల ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ 500ల పడకల ఆసుపత్రి స్థాయిని పెంచాలని అ సంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసి ప్రజలకు సకాలంలో అందు బాటులోకి తెచ్చి వైద్యసేవలు అందించాలని జిల్లా ఇంఛార్జి మంత్రి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ గురువారం హైదరాబాదులోని సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు.గద్వాలజిల్లా కేంద్రంలోని 300ల పడకల ఆసుపత్రి అసంపూర్తి పనులను పూర్తిచేసి ప్రభుత్వంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా నర్సింగ్ కళాశాలకు కావలసిన మౌలిక వసతులను కల్పిస్తూ, మండల కేంద్రాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అదనపు సౌకర్యాలు కల్పించి గ్రామాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి కృషి చేయాలని అంతేకాక ఆంధ్ర, కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న నడిగడ్డ ప్రాంత ప్రజలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రంలోని ఆసుపత్రులలో కూడా ఉచిత ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కోరారు. అందుకు జిల్లా ఇంఛార్జి వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



జిల్లా ఇంఛార్జి మంత్రిని కలిసి సమస్యలు వివరించిన జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

### వృద్ధ కళాకారులు లైఫ్ సర్టిఫికెట్‌ను

## ఈ నెల 31లోగా అందించాలి..

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 18 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా సాంస్కృతిక శాఖ ద్వారా వృద్ధ కళాకారుల పెన్షన్ పొందుతున్న కళాకారులు జనవరి 31వ తేదీ లోపు తమ లైఫ్ సర్టిఫికెట్ (జీవించి ఉన్నట్లు ధృవీకరణ పత్రం) జిల్లా పౌర సంబంధాల అధికారి నాగర్‌కర్నూల్ కార్యాలయంలో ఇవ్వాలని జిల్లా పౌరసరఫరాల అధికారి పీ.సీతారం తెలిపారు.ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఇవ్వాల్సిన లైఫ్ సర్టిఫికెట్‌ను కొంత మంది వృద్ధ కళాకారులు మాత్రమే ఇప్పటివరకు ఇచ్చారని, ఇంకా మిగిలిన వారు జనవరి 31వ తేదీ లోపు అందించాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్ కొరకు వృద్ధ కళాకారులు తమ ఆధార్ కార్డు తీసుకొని నేరుగా జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయానికి వచ్చిన అక్కడే కళాకారుడిని చూసి జిల్లా పౌర సంబంధాల అధికారి స్వయంగా లైఫ్ సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే ప్రతి నెల పెన్షన్ వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, సంవత్సరానికి ఒక సారి ఇచ్చే లైఫ్ సర్టిఫికెట్ డీపీఆర్ఓ కార్యాలయంలో అందించాలన్నారు.



పీ.సీతారాం

## ఘనంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదినోత్సవం



**కల్వకుర్తి, జనవరి 18, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలసాని శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బాణసంచాలు కాల్చి సంబురాలు నిర్వహించుకొని ఎమ్మెల్యే పేరిట ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్స్‌తో సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం మాట్లాడుతున్నా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి

**వనపర్తి టౌన్,జనవరి 18,ప్రభాతవార్త :** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం నందు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్,ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్స్ తో సమీక్ష సమావేశం జరిగినది. ప్రైవేట్ ఆసుపత్రులలో సాధారణ కాన్పులు పెంచాలి.అని అన్నారు.సి సెక్షన్స్ తగ్గించాలని అన్నారు.గర్భిణీ స్త్రీలు ఆరోగ్యాకరమైన గర్భధారణ ను కలిగి ఉండడానికి ప్రతిరోజు 300, 500 గ్రామ్స్ అదనపు క్యాలరీలు,15 గ్రామ్స్ ప్రోటీన్స్,10 గ్రామ్స్ కొవ్వు పదార్థాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి,ఎక్కువగా నీరు త్రాగాలి,ప్రతి రోజు ఆకు కూరలు,పాలు పండ్లు, తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.వేపుల్లు ఫాస్ట్ ఫుడ్ చిప్స్ లాంటివి వాటికి దూరంగా వుండాలి,గర్భిణీ స్త్రీలు శారీరక వ్యాయామం,యోగ మెడిటేషన్ చేయాలన్నారు.గర్భిణీ స్త్రీలు రక్త హీనత లేకుండా జాగ్రత్త పడాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి చంద్రయ్య,హెల్త్ ఎడుకేటర్ జె.మధు,డాక్టర్.ప్రత్యూష,డాక్టర్ మోహన్ మొదలుగు డాక్టర్స్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి



**వనపర్తి టౌన్ జనవరి18, ప్రభాతవార్త:** విశ్వవిఖ్యాత నటన సార్వభౌమునిగా చిత్ర సీమకు, తెలుగునాటక రాజకీయ చైతన్యాన్ని రగిలించిన నాయకునిగా రాజకీయ రంగానికి వన్నె తెచ్చిన నందమూరి తారక రామారావు 28వ, వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులర్పిస్తున్న వనపర్తి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు టిడిపి గౌస్, నందిమల్ల రమేష్, అంజ 222, డబ్బశ్రీను, యం.బాలు నాయుడు,బండారు గోపాల్, యండి. ఖాదర్, నందిమల్ల వెంకటస్వామి, తదితరులు ఆమహనీయునికి ఘనంగా నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**కొత్తకోట జనవరి 18 ప్రభాతవార్త:** మదనపురం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో చదువుతున్న విద్యార్థి సురేందర్ స్వహస్తలతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఫోటోతో పాటు స్వతంత్ర సమరయోధుల చిత్రాలను డ్రాయింగ్ చేశారు. గురువారం మదనపురం పట్టణ కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే మదుసూదన్ రెడ్డికి డ్రాయింగ్ వేసిన చిత్రాన్ని అందించారు. చక్కగా నాయకుల బొమ్మలు వేసిన విద్యార్థి సురేందర్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందించారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తు కుమారుని ప్రోత్సాహిస్తున్న తండ్రి అశోక్‌ను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిఆల్ రవీందర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు జగదీశ్, చుక్క మహేశ్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

## టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పిడిఎస్ రైస్ పట్టివేత



పిడిఎస్ రైస్ పట్టుకున్న పోలీసులు

**నారాయణపేట ప్రతినిధి,జనవరి 18 ప్రభాతవార్త:** నర్వ మండలంలోని పెదకడుమూర్ గ్రామంలోని నర్సింహ ఇంట్లో 3 క్వింటాళ్ల పిడిఎస్ రైస్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నర్వ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో ఆంజనేయులుకు చెందిన ఆటోలో 4.5 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ స్వాధీనం చేసుకున్నారు. సంగంబండ గ్రామంలోని కోమటి నవీన్ అనే వ్యక్తి ఇంట్లో 7 ప్యాకెట్ల బ్యాగ్స్ 3 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయా పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్వ, మక్తల్ ఎస్సైలు మాట్లాడుతూ అక్రమంగా పిడిఎస్ రైస్ తరలిస్తున్నందున నిల్వ ఉంచిన వారిపై డిటి పంచనామా అనంతరం కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఐదవ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈనెల 20 వరకు పొడిగింపు

**లింగాల,జనవరి 18 ప్రభాతవార్త:** ఐదవ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈనెల 20 వరకు పొడిగించినట్లు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు) ప్రిన్సిపాల్ డి. బాలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 20 లోపు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. 2024,25 విద్యా సంవత్సరానికి గురుకుల ప్రవేశాల కోసం ఎస్సీ, ఎస్టీ, బిసి పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్ కోసం రూ.200ల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 4న ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గోల్డ్‌లోన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

**లింగాల,జనవరి 18 ప్రభాతవార్త :** రైతులు, వ్యాపారస్తులు ఎవరైనా తమ అవసరాలకు అనుగుణంగా గోల్డ్‌లోన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని బ్యాంకు మేనేజర్ మోహన్ కోరారు. ఈ సందర్భంగా గోల్డ్ లోన్ పొందేందుకు పట్టాదారుని పాసుపుస్తకం జిరాక్స్,ఆధార్ కార్డు, రెండు ఫోటోలు, అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, జనవరి18,ప్రభాతవార్త:** జన హృదయనేత, పేదల పెన్నిధి, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకలను కల్వకుర్తి మండల క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన హృదయ నేత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి క్యాంప్ కార్యాలయానికి చేరుకోగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణసంచాలు కాల్చి స్వాగతం పలికి పలువురు నాయకులు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చలు బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. క్యాంప్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పేదల ప్రజల ఆశాజ్యోతి, ఆపదలో నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నారని వారు పేర్కొన్నారు. సమకాలిన రాజకీయాలను ఒంట పట్టుకొని ముందుకు సాగుతున్నారని, నవతరం నేత కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయురోగ్యారోగాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీలో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, జెడ్పీవైస్ ఛైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ జెడ్పీటీసీ అశోక్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్ కుమార్, సుదర్శన్‌రెడ్డి, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేష్‌బాబు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, సిల్వర్‌జూబ్లీక్లబ్ అధ్యక్షులు చింతల వెంకటరమణారెడ్డి,కాంగ్రెస్ నాయకులు కాయితీ విజయ్ కుమార్‌రెడ్డి, షాన్‌వాజ్‌ఖాన్, చిన్న రాంరెడ్డి, గుమ్మకొండ రాములు, సంజీవ్ కుమార్‌యాదవ్, రమాకాంత్‌రెడ్డి, సతీష్, ఏజాస్, గోరటి శ్రీనివాస్, బొమ్మ ఆంజనేయులు, రాకేష్‌శర్మ, దామోదర్‌గౌడ్, చంద్రకాంత్‌రెడ్డి, గోళి సురేందర్‌రెడ్డి, సంతుయాదవ్, పడకంటి వెంకటేష్, సమీర్ అహ్మద్ షేక్, లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు కలిమిచెర్ల రమేష్, టీఎస్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్, శ్రీధర్, గోవింద శ్రీనివాస్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, రాఘవేందర్, శ్రీనివాస్, కొండూరు కృష్ణ, గోవింద కృష్ణయ్య, గుబ్బ కిషన్, సామల రాజేష్ ఉన్నారు.



ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పలువురు నాయకులు

# జడ్చర్ల వాసికి డాక్టరేట్ పట్టా

- వృక్షశాస్త్రంలో పీహెచ్‌డి పొందిన పుల్లని సురేష్
- అభినందించి సన్మానించిన కాలనీ వాసులు



**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18 ప్రభాతవార్త:** జడ్చర్లలో విద్యానగర్ కాలనీకి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు పి. కృష్ణయ్య కుమారుడు పి.సురేష్ పిహెచ్‌డి పట్టా పొందారు. తమిళనాడు రాష్ట్రంలోని ప్రభుత్వ భారతి దాసన్ యూనివర్సిటీ తిరుచురాపల్లి (తిరుచి)లో యూనివర్సిటీ క్యాంపస్‌లో రెగ్యులర్ విద్యార్థిగా పిహెచ్‌డి పూర్తి చేశారు.యూనివర్సిటీ క్యాంప స్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా, రాష్ట్ర గవర్నర్ రవి, అక్కడి ముఖ్యమంత్రి స్టాలిన్, విసి సెల్వం పాల్గొని జనవరి 2న పట్టా ప్రధానం చేశారు. దళిత కుటుంబంలో పుట్టి ఇంతటి గణనీయ స్థానాన్ని పొందినందుకు ఉపాధ్యాయ వర్గము, 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి, కౌన్సిలర్ ఉమాదేవి, సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బాద్మి శివకుమార్ అభినందించారు. గైడ్ ప్రొఫెసర్ లక్ష్మిప్రభ ఆధ్వ ర్యంలో వృక్షశాస్త్రంలో (ఫైటో కెమిస్ట్రి) ఇండియన్ కోబ్రా పాము విషానికి విరుగుడు సాల్వియా నొలిక్ యాసిడ్ బి అనే ఔషధాన్ని కనుగొని నిరూ పించినందుకు ఈ పట్టా ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పట్టాఅందుకున్న సురేష్‌ను గురువారం కాలనీలోని వారినివాసంలో కౌన్సిలర్లు,నాయకులు,కాలనీవాసులుఘనంగా సత్కరించారు.

**సైంటిస్ట్ కావడం నా లక్ష్యం:** మాది సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం గుడిగానిపల్లి. మా చదువులు, ఉద్యోగరీత్యా జడ్చర్లలో ఉంటున్నాం. మా నాన్న పికృష్ణయ్య రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయులు. నాకు కుటుంబ సహకారం ఎంతో ఉన్నది. నాగుపాము, కోబ్రా లాంటి విషపూరిత పాముల విరుగుడుగా మందును కనుగొనడానికి పీహెచ్‌డీలో కోర్సుగా ఎంపిక చేసుకున్నా. అయిదేండ్లలో కోర్సు పూర్తి చేశా. కరోనా వల్ల కొంత ఇబ్బంది జరిగింది. యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కూడా జాయిన్ అయ్యాక నా రీసెర్చ్ కొనసాగిస్తా. యూనివర్సిటీలో అక్క డ అందరి సహకారంతో పీహెచ్‌డీ పూర్తి చేశాను. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలో మూడు నాలుగు యూనివర్సిటీలో ఇంట ర్వ్యూలకు అప్లికేషన్ చేశాను. ఈనెల 23న తమిళనాడులోని కామరాజు కళాశాలలో ఇంట ర్వ్యూ ఉంది. సైంటిస్ట్‌గా కావడం నా జీవితకాల లక్ష్యం.



పట్టా అందుకుంటున్న సురేష్

- పుల్లని సురేష్, జడ్చర్ల.

## పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలి

**అచ్చంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్**



పంటల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడి చంద్రశేఖర్

**లింగాల,జనవరి 18 ప్రభాతవార్త:** యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అచ్చంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలోని వ్యవసాయ పొలంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి నమోదు చేస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాసంగి పంటల వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నప్పుడు వారి వద్దకు వెళ్లి పంటల వివరాలు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. చీడ,పీడ పురుగుల నుంచి పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి మానస, రైతులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు అభిమన్యుడి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అభిమన్యు యువసేన సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి18, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ యువనేత, దొండ్లపల్లి ఎంపీటీసీ చింపోడ్ అభిమన్యురెడ్డి తనవంతు సాయం చేస్తూ ఉదారతను చాటుకుంటున్నారు. రాజాపూర్ మండలం కల్లేపల్లి గ్రామంలో మట్కికర్ రాణిబాయి అనారోగ్యంతో గురువారం మరణించాడు. విషయం తెలుసుకున్న యువనేత అభిమన్యురెడ్డి బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించాడు. బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం ప్రకటించడంతో అభిమన్యు రెడ్డి యువసేన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల నగదు అందజేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామధ్యక్షుడు శ్రీను, బండ శ్రీను, శ్రీకాంత్, బుచ్చయ్య,యాదగిరి,బాలాజీ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవానికి జిల్లా ఇంఛార్జి మంత్రికి ఆహ్వానం



**ఇటిక్యాల,జనవరి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ పంచాయతీలో 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవన ప్రారంభోత్సవానికి హాజరు కావాలని జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహను ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఎర్రవల్లి సర్పంచ్ రవి కలిసి ఆహ్వా నించారు. గురువారం సచివాయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా అలం పూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎర్రవల్లి సర్పంచ్ జోగుల రవికలిసి నూతన గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవానికి ఆహ్వా నించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంజి పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**జిల్లాస్థాయి అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్**



కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,జనవరి 18 ప్రభాతవార్త :** జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని, జిల్లా అధికారుల సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో ఉండేలా చూడాలని కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అందుబాటులో ఉండి పనులు పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. ఆయాశాఖల వారిగా జిల్లా అధికారులు వారు శాఖ తరపున చేయాల్సి న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు తమ శాఖల పరిధిలోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల ఆకస్మిక తనిఖీ

**బిజినేపల్లి,జనవరి18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాలెం గ్రామంలో ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి నీతిరెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ దుకాణాల్లోని ఇన్‌పుట్ డీలర్లు విధిగా స్టాక్ రికార్డులు, ఎరువులు, క్రిమి సంహారకాలు, విత్తనాల విక్రయాల నమోదును ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేస్తున్నారో లేదో పరిశీలించారు. స్టాక్ రికార్డుల్లో నమోదు చేసిన వివరాల మేరకు అధికంగా ఎరువులు కొనుగోలు చేసిన రైతులను పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల ప్రకారం ఎరువుల నిల్వ లేకుంటే శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయ అధికారి హెచ్చరించారు. ప్రతి కొనుగోలుదారునికి సంబంధించి ఈపాస్ మిషన్లు ఖచ్చితంగా వినియోగించాలని రైతులకు సంబంధించిన ఆధార్‌కార్డు, వేలిముద్రలను తీసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలుచేసే ఎరువులు, క్రిమిసంహారక మందులకు సంబంధించి ఖచ్చితంగా పిఓఎస్ మిషన్ ద్వారానే క్రయ విక్రయాలు జరగాలని సూచించారు. నిషేధిత క్రిమి సంహారకాలను, విత్తన రకాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు చేయిస్తామని హెచ్చరించారు.



ఫర్టిలైజర్ దుకాణాల ఆకస్మిక తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

## ఫీల్డ్ అసిస్టెంట్ల తాలూకా కమిటీ కార్యవర్గం ఎన్నిక



ఫీల్డ్ అసిస్టెంట్ల తాలూకా సంఘం అధ్యక్షుడిగా మేడమోని మల్లయ్య

**ఉప్పునుంతల,జనవరి 18 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల తాలూకా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా ఫీల్డ్ అసిస్టెంట్ సం ఘం అధ్యక్షునిగా, ఉప్పునుంతల ఫీల్డ్ అసిస్టెంట్ మేడమోని మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా పదర వెంకటేష్, కోశాధికారిగా బొడ గణేష్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సాయిలు,సహాయ కార్యదర్శి నరసింహ, రాధ, ప్రచార కార్యదర్శిగా చెన్నయ్య, కమిటి సభ్యులు మురళి,నాగేందర్, రవి, వెంకటమ్మ, లలిత, కృష్ణయ్య, బొడియా,నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూత నంగా ఎన్నికైన ఫీల్డ్ అసిస్టెంట్ల తాలూకా సంఘం అధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యను సత్వరమే పరిష్కరించాలని 4779 జిఒను వెంటనే రద్దుచేయలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 24 వేలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మల్లయ్య డిమాండ్ చేశారు.

## అగ్ని ప్రమాదంలో ఎండుమిర్చి దగ్ధం



కాలిపోయిన ఎండుమిర్చిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి, రైతు

**లింగాల,జనవరి 18 ప్రభాతవార్త:** కల్లంలో ఆరబెట్టిన ఎండుమిర్చి ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లింగాల మండల పరిధిలోని బాకారం గ్రామానికి చెందిన రైతు కుడుకుంట్ల శ్రీపతిరెడ్డి తన వ్యవసాయ పొలంలో రెండున్నర ఎకరాల్లో మిర్చిపంట సాగు చేశాడు. మిర్చిపంట తెంచి తన కల్లంలో రోజువారి మాదిరిగా ఆరబెట్టాడు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లి ఎండుమిర్చి ఆరబెట్టి ఇంటికి వచ్చాడు. తిరిగి సాయంత్రం పొలానికి వెళ్లి చూడగా కల్లంలో ఆరబెట్టిన మిర్చి పూర్తిగా కాలి బూడిద అయి ఉంది. కల్లం పక్కన గడ్డి, ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో నిప్పులు చెలరేగి గడ్డి కాలి ఆరబెట్టిన ఎండుమిర్చి కాలి బూడిదైంది. ఎండుమిర్చి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు కోరారు. మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి గురువారం పొలం వద్దకు వెళ్లి సంఘటనను పరిశీలించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**వెల్దండ, జనవరి18 ప్రభాతవార్త:** మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బాణావత్ అరుణ్‌కుమార్ ఇసుకకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా చెర్కూర్ గేటు వద్ద బ్లూకోర్టు పోలీసులకు ఎదురు కావడంతో వారు పరిశీలించి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

## బాధితుడికి మిత్ర ఫౌండేషన్ ఆర్థిక సాయం



జంగాచారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం


**కల్వకుర్తిరూరల్, జనవరి 18 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన జంగాచారి అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ జంగాచారిని గురువారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. జంగాచారి కుటుంబానికి మిత్ర ఫౌండేషన్ తరుపున అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## కిడ్నీ బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే



**వనపర్తి టౌన్,జనవరి 18,ప్రభాతవార్త:** తన వద్ద పనిచేసే గోపాల్ భార్య యాదమ్మ కిడ్నీ సమస్యతో ఇబ్బంది ఎదుర్కొంటుందని సమాచారం తెలుసుకున్న.ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తక్షణమే స్పందించి హైదరాబాద్ ఫిలింనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందజేయాలని అందుకు అయ్యే ఖర్చు గురించి ఆలోచించకుండా మెరుగైన వైద్యం చేయించాలని సూచించారు.ఈ క్రమంలో గత మూడు రోజులుగా అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా యాదమ్మను ఆయన గురువారం హాస్పిటల్ లో పరామర్శించారు.సంబంధిత వైద్యులతో మాట్లాడి సమస్యకు గలకారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక శ్రద్ధతో మెరుగైన వైద్యంఅందించాలని ఆయన వైద్యులకు సూచించారు.తీవ్రఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబానికి నేనున్నానంటూ భరోసా కల్పించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**వనపర్తి టౌన్,జనవరి 18,ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో నర్సింగాయపల్లిలో 4వ వార్డుకు చెందిన పోలాకల బాలనాగమ్మ అనారోగ్యం బాగా లేక మరణించడం జరిగింది. వార్డుకు చెందిన నక్క రాములు యాదవ్ శేఖర్ రెడ్డి వెంకట్ ఎమ్మెల్యే మేఘా రెడ్డి సమాచారం ఇవ్వగా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ కౌన్సిలర్స్ విభూతి నారాయణ సుమిత్ర యాదగిరి శేఖర్ కూరగాయల రవి నక్క రాములు ఆదిత్య శశాంక్ సాగర్ అందరు కలిసి బాలనాగమ్మమృతదేహానికి పూలమాలలు వేసినివాళులర్పించడం జరిగింది.వారి కుటుంబాన్ని ఓదార్చి వారి కుటుంబానికి ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది.

## టిఆర్ఎస్ పార్టీకి కార్మిక విభాగం అధ్యక్షుడు రాజీనామా..

**ఖిల్లాగణపురం జనవరి 18, ప్రభాతవార్త:** టిఆర్ఎస్ పార్టీకి చెందిన జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు విప్పటూరి విక్రమ్ ప్రాథమిక జిల్లా పదవులకు రాజీనామా చేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి ఎస్.నిరంజన్ రెడ్డికి టిఆర్ఎస్ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు రాంబాబు యాదవ్‌కు తన రాజీనామా లేఖను పంపించినట్లు విక్రమ్ తెలిపారు.

# నవోదయ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**బిజినేపల్లి, జనవరి 18 ప్రభాతవార్త :** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం జరగబోయే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాల్సిందిగా నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయాలలో ఆరవ తరగతి ప్రవేశానికి గాను ఈనెల 20వ తేదీన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించబోయే ప్రవేశపరీక్షకు సంబంధించి 26 పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, కేంద్ర పరిశీలనాధికారుల శిక్షణా శిబిరం గురువారం బిజినేపల్లిలోని ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి. భాస్కర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ శిబిరంలో నవోదయ ప్రవేశ పరీక్ష ఇంచార్జి వి. భాస్కరాచారి మాట్లాడుతూ నవోదయ పరీక్ష నిర్వహణలో సెంటర్ సూపరింటెండెంట్‌ల, అబ్జర్వర్ల బాధ్యతలను వివరించారు. ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ మాట్లాడుతూ నవోదయ పరీక్ష నిర్వహణలో సంబంధిత అధికారులు అత్యంత బాధ్యతగా ఉండి ప్రతి విషయంలోనూ జాగ్రత్త వహించాల్సిందిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ కోరారు. ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్లు, వివిధ విద్యాశాఖ అధికారుల సంయుక్త సహకారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. సంబంధిత పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీ అధికారులను నియమించడం జరిగిందని, వివిధ జిల్లాల ఎస్పీల ఆదేశాలతో తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పరీక్షల నిర్వహణలో అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వకుండా అత్యంత జాగ్రత్తగా శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం వివిధ కేంద్రాల సూపరింటెండెంట్‌లకు, అబ్జర్వర్లకు నాన్ కాన్ఫిడెన్షియల్ మెటీరియల్‌ను అందజేశారు.



నవోదయ పరీక్ష నిర్వహణపై విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్‌రావు

# ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని రాస్తారోకో

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 18 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో శాశ్వత ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గురువారం ఎంపిపి కార్యాలయం ముందున్న జాతీయ రహదారిపై ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల బాధితులు దాదాపు గంటపాటు రాస్తారోకో చేశారు. దీంతో ప్రయాణీకులు వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తాత్కాలిక ఆధార్ కేంద్రంగా రెండు రోజుల్లో కూడ నిర్ణయం తీసుకుంటామని అంతవరకు విరమించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఫోన్‌లో మాట్లాడి హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. ఈనెల 12వ తేదీన మార్పు, చేర్పులకు 18వ తేదీన రావాలని తమకు టోకెన్లు ఇచ్చారని, అక్కడ కంప్యూటర్ల ఆపరేట్ సిబ్బంది లేరని ఇదేమని ఆరాతీస్తే కలెక్టర్ ఇచ్చిన గడువు ముగియడంతో సిబ్బంది వెళ్లిపోయారని ఇంకా పెండింగ్‌లో ఉన్న ఆధార్‌కార్డు వాళ్ల పరిస్థితి ఏంటని రాస్తారోకో చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన పలు పథకాలకు దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్‌కార్డులో పేర్లు ఉన్న, ఫోన్ నంబర్లు తదితర వివరాలు, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం గుర్తించి ఆధార్ కేంద్రాల నుండి మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మక్తల్‌లో ఉన్న ఆధార్ కేంద్రాలు తప్పుడు వివరాలను నమోదు వాటిని బ్లాక్ లిస్టులో పెట్టారు. ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కొన్ని రోజులకు తాత్కాలిక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆ మార్పులు, చేర్పులు తదితర వాటి కొరకు ఆధార్ తప్పనిసరి పరిస్థితిలో నెలకొందని వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. కలెక్టర్ స్పందించి వెంటనే రేపటినుంచి ఐదురోజుల పాటు తప్పకుండా ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని అనంతరం కూడా అవసరమైతే మక్తల్ మండల కేంద్రం లో శాశ్వతంగా ఆధార్ సెంటర్ ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

## బస్టాండ్లు కిటకిట..

- గ్రామాల నుంచి పట్నం బాట..
- రద్దీగా ఆర్టీసీ బస్టాండ్లు..
- బస్సులు సరిపడక ప్రయాణికుల ఇబ్బందులు..

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18, ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సెలవులు ముగియడంతో ప్రయాణికుల రద్దీ గురువారం కొనసాగింది. ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. బుధవారంతో విద్యార్థులకు సెలవులు ముగియడంతో రెండు రోజుల నుంచి పల్లెల నుంచి హైదరాబాద్ లాంటి పట్టణాలకు తిరుగు పయమయ్యారు. అయితే హైదరాబాద్‌కు బస్సులు సరిపడగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వచ్చిన బస్సు వచ్చినట్లే ప్రయాణికులతో నిండిపోవడంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులుపడ్డారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల బస్టాండ్లు విద్యార్థులతో రద్దీగా మారాయి. తమ లగేజీలతో తిరిగి విద్యాలయాలకు పయనమయ్యారు. మహిళలకు పల్లెవెలుగుతోపాటు ఎక్స్ ప్రెస్‌లో ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

## అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

### - వెల్లడించిన జడ్చర్ల మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ జే కల్పన

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 18, ప్రభాతవార్త :** జడ్చర్ల మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాల స్థాయిలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఎంపీసీ , బైపీసీ గ్రూపులకు సంబంధించి అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ జే కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, మైనార్టీ, సిక్కులు, జైనులు, బుద్ధుల వర్గాలకు చెందిన మైనార్టీలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6,7,8 తరగతులకు పరిమిత సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఐదో తరగతికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సీట్ల కేటాయింపు ఏప్రిల్ 24 నుంచి 30వరకు ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్‌కు పదో తరగతి పరీక్షా ఫలితాలు వెలువడ్డ వెంటనే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు.

## ఘనంగా సింగోటం లక్ష్మినరసింహ స్వామి రథోత్సవం

### రథోత్సవంలో పాల్గొన్న మంత్రి జూపల్లి



సింగోటం జాతరలో పాల్గొన్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్, జనవరి18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సింగోటం గ్రామంలో శ్రీలక్ష్మినరసింహస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. లక్ష్మినరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామి రథోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం జాతరలో ప్రజలతో మమేకమై కలియ తిరుగుతూ ప్రజలకు అభివాదం చేస్తూ భక్తులతో కలిసి రథోత్సవంలో అనంతరం శ్రీవారి సముద్రంలో బోటింగ్ చేస్తూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జాతరలో యువకులు, మహిళలు మంత్రి జూపల్లితో సెల్ఫీలతో సందడి చేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ రాజా ఆదిత్య వెంకట లక్ష్మణరావు, అధికారులు, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## అంబిగార్ చౌడయ్య ఆధ్యాత్మిక మార్గం ఆదర్శప్రాయం




**కృష్ణ, జనవరి 18 ప్రభాతవార్త :** 12వ శతాబ్దంలో ప్రజలకు మూఢ నమ్మకాలు, అప్పటి ఆచారాలపై అవగాహన కల్పిస్తూ, ఆధ్యాత్మిక మార్గం చూపిన అంబిగార్ చౌడయ్య జీవితం ఎందరికో ఆదర్శప్రా యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. అంబిగార్ చౌడయ్య స్పూర్తితో ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని సూచించారు. క్రిష్ణ మండలంలోని కున్సి గ్రామ నేతలు ఎమ్మెల్యేకు అంబిగార్ చౌడయ్య చిత్రపటాన్ని బహూకరించడంతో పాటు శాలువా కప్పి సత్కరించారు. అబిగార్ చౌడయ్య జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి

### రవాణా శాఖ మంత్రిని కోరిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్



మంత్రికి పూలబోకే అందజేస్తున్న నాయకులు

**అలంపూర్ జనవరి 18, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని రాజోలి మండలం పెద్ద ధన్వాడ అలంపూర్ మండలం భీమవరం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాదులోని సచివాలయంలో రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యాలు లేవని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రికి విన్నవించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే రవాణా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. ఆయనతో పాటు అలంపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రవల్లి సర్పంచు జోగులరవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజి, పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**కొత్తకోట, జనవరి 18, ప్రభాతవార్త:** కొత్తకోట మండలం అమడబాకుల స్టేజి సమీపంలో ఉన్న మైనార్టీ గురుకుల కళాశాల దేవరకద్ర బాలుర 1లో ఇంటర్‌లో చేరే విద్యార్థులకు ఆన్లైన్‌లో ఈనెల 18 నుండి ఫిబ్రవరి6 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖదీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆధార్, విద్యార్థి ఫోటో సంతకంతో ఎలాంటి రుసుము లేకుండా ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మైనార్టీలకు 60, నాన్ మైనార్టీలకు 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. వివరాలకు 9154365029, 9642759772 సంప్రదించాలని కోరారు.

## శంకర సముద్ర కాల్వకు మరమ్మతులు చేయండి



టెక్కలయ్య దగ్గర ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**కొత్తకోట, జనవరి 18, ప్రభాతవార్త:** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో టెక్కలయ్య దర్గా వద్ద శంకర సముద్రం నుండి రైతుల పొలాలకు నీరు వెళ్లే దారిని (డొంగు)ను వెడల్పు చేసి పంట పొలాలకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ని కోరారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. అనంతరం కొత్తకోట చావిడిలో మినీ హెల్త్ సెంటర్ లో కూలిపోయిన భవనాన్ని పరిశీలించి హెల్త్ వర్కర్స్ తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని హెల్త్ సెంటర్ భవన నిర్మాణం కోసం నివేదిక అందజేయాలని. మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. అనంతరం 1వ వార్డులో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ చెప్పారు. అదేవిధంగా టెక్కలయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పల్లెపాగు ప్రశాంత్, బోయజ్, పి కృష్ణారెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, రావుల కర్ణాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జితేందర్ నాథ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పి జే బాబు, కో ఆప్షన్ సభ్యులుమిషేక్, లతీఫ్, ఎంపీటీసీలురాధా, చిట్టెమ్మ, సర్పంచులు శేఖర్‌రెడ్డి, శివరాజ్, విశ్వనాథం, శివరాములు, మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీచ్పల్లి యాదవ్, నరేందర్ రెడ్డి, గొల్ల బాబు, మోహన్ రెడ్డి, సాయిల్ యాదవ్ పాల్గొన్నారు.

## బైక్, బొలేరో ఢీకొని వ్యక్తి మృతి

**చిన్నంబావి, జనవరి 18 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెలుగొండ గ్రామ సమీపంలో పెబ్బేరు కొల్లాపూర్ రోడ్డుపై బైక్ బొలేరో వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మండల పరిధిలోని దగడపల్లి గ్రామానికి చెందిన బక్కి రాజేందర్ (40) వ్యక్తిగత పని నిమిత్తం పెబ్బేరు వైపు వెళుతున్న క్రమంలో పెబ్బేరు వైపు నుంచి కొల్లాపూర్ వెళ్తున్న బొలేరో వాహనం, బైక్ ఎదురుగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుడిభుజం, కాలు విరగడం జరిగింది. గాయాలైన అతన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగింది. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ ఆశ్రయం కోల్పోయింది. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వార్త దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

### వార్త వాస్తవాలకు ప్రతిరూపం : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి




వార్త దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 18 ప్రభాతవార్త:** మక్తల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వార్త జాతీయ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం ఆవిష్కరించారు. క్యాలెండర్‌ను ఆవిష్కరిం చిన అనంతరం ఎమ్మె ల్యే మాట్లాడుతూ దాదాపు 23 సంవత్సరాల క్రితమూ ఆవిష్కృతమైన వార్త దినపత్రిక పేదల పక్షపాతి అనడానికి సంకోచిం చాల్సిన అవసరం లేదని నిజాలను నిర్భయంగా రాయడంలో వార్త పత్రిక ఆరితేరిందని వార్త పత్రి కల్లో వచేవాస్తవాలను ఎన్నో ఏళ్లనుంచి చూస్తున్నామని అలాంటి పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్క రించడం చాలా సంతోషంగా ఉందని రాబోయే కాలంలో కూడా ఇంకా వార్త దినపత్రికఉన్నత శిఖరాలను అధిరోహించాలనివార్త పత్రిక రిపోర్టర్లకు పత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని అన్నారు. కార్యక్రమానికి వివిధ పత్రిక విలేఖరులు, సీనియర్ పాత్రికేయులు, దిశా రిపోర్టర్ అంజన్‌ప్రసాద్, ఎబి న్యూస్, ఉమ్మడి జిల్లా ఇంఛార్జి శ్రీనివాస్, ఆదాబ్ హైదరాబాద్ పృథ్విరాజ్, ప్రజాపక్షం, ప్రజాపక్షం అచ్చప్ప, ప్రజా దర్బార్ కార్తీక్, వార్త దినపత్రిక నారాయణపేట జిల్లా ప్రతినిధి నవీన్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవాలి

**మక్తల్ రూరల్, జనవరి 18 ప్రభాతవార్త:** జక్లేర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, పోలీస్ కళాబృందం వారు బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల ఏర్పడే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, సమయపాలన, అమ్మాయిలు, మహిళలపై వేధింపులు, లీడర్‌షిప్ లక్షణాలు, గోల్ సెట్టింగ్, చదువుపై శ్రద్ధ, రోడ్డు భద్రత నియమాలు పౌరుల హక్కులు మొదలగు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై 2ఆచారి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి క్రమశిక్షణో బాగా చదువుకోవాలని, చదువుతోపాటు వివిధ రకాల పుస్తకాలను చదవాలని, నాలెడ్జ్ పెంచుకోవాని బుక్స్ చదవడం వల్ల నాలెడ్జ్ పెరుగుతుందని తెలిపారు. అలాగే తల్లిదండ్రులను, పెద్దలను, గురువులను గౌరవించాలని మంచి సత్ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులు ఇంటికెళ్లిన తర్వాత సెల్‌ఫోన్‌లతో ఎక్కువగా గడుపుతున్నారని వాటివల్ల అనర్థాలు ఎక్కువ జరుగుతున్నాయని కావున సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. మహిళలు, ఆడపిల్లలను ఎవరైనా లైంగికంగా, మానసికంగా, శారీరకంగా వేధించిన, ర్యాగింగ్ చేసిన ధైర్యంగా పోలీసులకు చెప్పాలని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్‌కళాబృందం సభ్యులుసురెందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, రుఖ్య నాయక్, కళ్యాణి, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# గ్రామాభివృద్ధిలో ఎంపిడిఓ, ఎంపిఓలదే కీలక పాత్ర

### జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

**గద్వాల ప్రతినిధి, జనవరి18 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఎంపిడిఓలు, ఎంపిఓల పాత్ర కీలకమని, గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. గురువారం జిల్లా ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలులో ఎంపిడిఓలు, ఎంపిఓలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో మండల ఎంపిడిఓలు, ఎంపిఓలు పనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ ఒక్కో మండల ఎంపిడిఓ, ఎంపిఓలను వారు చేసే పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలలో జరుగుతున్న పనులను గురించి ఎంపిడిఓలు వివరించారు. డిఆర్‌డిఎ డిపిఓ పరిధిలో చేసే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీలోని ప్రతి సమస్యకు స్పందించే విధంగా మండల అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాలలో త్రాగునీరు పారిశుధ్ధ్యం, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, హౌస్ టాక్స్, లేబర్ పనులు తదితర పనులపై తరచు గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి మీరు చేసే పనుల పురోగతిపై రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, డిఆర్‌డిఎ కాంతమ్మ, డిపిఓశ్యాంసుందర్, అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎంపిఓలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



జిల్లా ఎంపిడిఓలతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్

# సమస్యల పరిష్కారానికి జనరల్ బాడీ సమావేశం

**చిన్నంబావి, జనవరి 18 ప్రభాతవార్త:** చిన్నంబావి మండల జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఎంపిపి మండిపడ్డారు. సమీక్ష సమావేశంలో వచ్చే వేసవి కాలంలో నీటిఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటిసి వెంకటరమణ పాల్గొన్నారు. మహిళా సమైక్యలో ప్రోటోకాల్ పాటించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం సబబు కాదని ఆగ్రహించారు. మహిళా సంఘాలు తీసుకున్న లోన్‌లను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధి కోసంపాటుపడాలని, మహిళా సంఘం సభ్యులను ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యంగా వేసవి కాలంలో నెలకొనబోయే తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి సోమేశ్వరమ్మ

## ప్రజాపిత బ్రహ్మర్షి బోధనలు ఆచరణీయం

**నారాయణపేట ప్రతినిధి, జనవరి 18 ప్రభాతవార్త:** ఓం శాంతి బ్రహ్మకుమారీస్ వ్యవస్థాపకులు, ప్రజాపిత బ్రహ్మర్షి బోధనలు, మార్గం ఆచరణీయమని సంతోషి తెలిపారు. మక్తల్‌లోని ఓం శాంతి వనంలో ప్రజాపిత బ్రహ్మర్షి స్మృతిదినం సందర్భంగా చిత్రపటానికి పూజా కార్యక్రమాలు చేసి గంటపాటు ధ్యానం నిర్వహించారు. అనంతరం జ్ఞానం గురించి బోధనలు చేశారు. బ్రహ్మర్షి అనుసరించిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. ఆతర్వాత అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలోమక్తల్, మాగనూరు, క్రిష్ణ, నర్వ మండలాలనుంచి పెద్దఎత్తున భక్తుల పాల్గొన్నారు.



ప్రజాపిత బ్రహ్మర్షికి నివాళులర్పించి ధ్యానం చేస్తున్న దృశ్యం

## ప్రతి పంచాయతీలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులే..

మొదటి పేజీ తరువాయి భాగం..

నరేంద్రమోడీ కరీంనగర్ జిల్లాలోని మల్లికార్జున్‌రెడ్డితో మాట్లాడడం జరిగింది. జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందిందంటే ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయని జరిగే ప్రతి పనిలో 90శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నిధులని మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలలో జరిగే ప్రతి పనిలో 90 శాతం నిధులు కేంద్రానివే అన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, ప్రధానమంత్రి ఫసల్ భీమా, గరీబ్ కళ్యాణ్ యోజన ముద్ర లోన్లు, పీఎం విశ్వకర్మ ఇలా ఎన్నో అభివృద్ధి పనులు ప్రధానమంత్రి నరేంద్రమోడీ విచ్చేసిన తర్వాత జరిగిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కెకె రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వివిధ పథకాల గురించి జీవన్ జ్యోతి, జీవన్ సురక్ష పాలసీ, ముద్రలోన్, ఉజ్వల్ యోజన, ఉచిత సిలిండర్, ఆయుష్మాన్ భారత్‌కింద రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు, గ్రామాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, మండల ఉపాధ్యక్షులు రామకృష్ణ, మండల మహిళా మోర్చా అధ్యక్షులు శారద, మండల కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, వెంకటేష్, కృష్ణ, హరి, మహేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వికసిత్ భారత్ సంకల్పయాత్ర సందర్భంగా మాట్లాడుతున్న జిల్లా పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి